సాక్షి
నిజామాబాద్

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



ముగిసిన క్రీడలు
జిల్లా కేంద్రంలో రెండు రోజులపాటు కొనసాగిన జోనల్ స్థాయి అటవీశాఖ క్రీడలు శనివారం ముగిశాయి.
- 8లో ▸



లేత మనసుకు..
జిల్లాలో పోక్సో కేసుల సంఖ్య పెరుగుతోంది. లైంగిక దాడులు, అత్యాచారాలు లేత మనసులపై గాయాలు చేస్తున్నాయి.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.6 /22.2
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

హైకోర్టు జడ్జికి ఘనస్వాగతం



ఖలీల్‌వాడి: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె సురేందర్ శనివారం జిల్లా పర్యటనకు వచ్చారు. ఆర్ అండ్ బీ అతిథిగృహం వద్ద జిల్లా జడ్జి సునీత కుంచాలతోపాటు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ న్యాయమూర్తికి ఘనస్వాగతం పలికారు. అనంతరం జిల్లా కోర్టు భవన సముదాయంలో న్యాయాధికారులతో హైకోర్టు న్యాయమూర్తి భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు, న్యాయ శాఖ అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అంతకుముందు హైకోర్టు న్యాయమూర్తి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

డీపీవో తరుణ్ బదిలీ


తరుణ్‌కుమార్

సుభాష్‌నగర్: జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) చక్రవర్తుల తరుణ్‌కుమార్‌ను కేంద్ర ప్రభుత్వ సర్వీసులకు కేటాయిస్తూ ప్రభుత్వం శనివారం ఆదేశాలు జారీ చేసింది. తరుణ్‌కుమార్ ఈ ఏడాది ఫిబ్రవరిలో వికారాబాద్ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. సోమవారం ఆయన విధుల నుంచి రిలీవ్ కానున్నట్లు తెలిసింది. జిల్లా పంచాయతీ అధికారిగా ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించలేదు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



డొంకేశ్వర్(ఆర్మూర్): అధిక పని ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ విస్తీర్ణ అధికారులు జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఏడు సంవత్సరాలుగా పని చేస్తున్నా తమ సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదని, 6,500 ఎకరాలకు ఒక ఏఈవో మాత్రమే ఉన్నారని తెలిపారు. పంటల సర్వేతోపాటు రైతుబీమా, రైతు నేస్తం, పీఎం కిసాన్, రైతులకు అవగాహన కార్యక్రమాలు వంటి పనులు చేస్తూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక ఏఈవోతోపాటు సహాయకులను నియమించాలని, ఆ తర్వాతే డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టాలని కోరారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 27 నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి లక్‌పతి, తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం



ఖలీల్‌వాడి: తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి వైజయంతి ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని కోర్టుల్లో విధులు నిర్వర్తిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం సమీక్ష నిర్వహించారు. నూతన చట్టాలు అమలులోకి వచ్చిన నేపథ్యంలో బాధితులు, సాక్షులకు సాక్ష్యం ఇవ్వడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ నెల 28న నిర్వహించనున్న 'మెగా లోక్‌అదాలత్' ద్వారా రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసులతోపాటు వేర్వేరు కేసులను పరిష్కరించేందుకు అవలంబించాల్సిన నిబంధనలను వివరించారు. నూతన చట్టాలను అవలంబించి నేరస్తులకు శిక్షపడే విధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వారి పరిధిలోని పోలీసు వారికి సలహాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజగోపాల్‌గౌడ్, రాజారెడ్డి, బంటు వసంత్, కె శేషు, శ్యాంరావు, నిమ్మ దామోదర్‌రెడ్డి, ఖాండేశ్ శ్రీనివాస్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జి రామకృష్ణ, ఎండీ రహీముద్దీన్, భూసారపు రాజేశ్‌గౌడ్, చిదిరాల రాణి తదితరులు పాల్గొన్నారు.

పెట్టని గోడలు
ఆ బండరాళ్లు


ప్రాజెక్ట్ వరద గేట్ల ముందర విశాలమైన బండరాయి


నీటి ప్రవాహంతో కోతకు గురైన బండరాయి

ఉధృత గోదావరి ప్రవాహాన్ని నియంత్రించడంలో పెట్టని గోడలుగా నిలుస్తున్నాయి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోని బండరాళ్లు.. అప్పట్లో ఇంజినీర్లు విశాలమైన బండరాయిని ఎంచుకుని ప్రాజెక్టు నిర్మించారు. 16 లక్షల క్యూసెక్కుల నీటిని ఒక్కసారిగా గోదావరిలోకి వదిలినా ఇబ్బంది లేకుండా నిర్మాణం చేపట్టారు. నదిలో నిటారుగా నిలుస్తూ కనిపించే బండరాళ్లు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.
– బాల్కొండ


వరద తాకిడిని నియంత్రిస్తున్న పెద్ద బండరాళ్లు

చైర్మన్ ముప్ప గంగారెడ్డి

- నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గాన్ని ప్రకటించిన ప్రభుత్వం
- వైస్ చైర్మన్‌గా జంగిటి రాంచందర్‌తో పాటు మొత్తం 18 మంది సభ్యులు
- కొలువుదీరనున్న కమిటీ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆరేళ్ల సుదీర్ఘ కాలం తరువాత నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం శనివారం ప్రకటించింది. చైర్మన్ గా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, వైస్ చైర్మన్‌గా జంగిటి రాంచందర్ నియమితులయ్యారు. చైర్మన్ సహా 18 మంది పాలకవర్గ సభ్యులతో కమిటీని ప్రకటిస్తూ మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మార్కెట్ కమిటీలో పాలకవర్గం కొలువుదీరనుంది. రాష్ట్రంలోనే అతి పెద్ద మార్కెట్లలో ఒకటైన నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ కాంగ్రెస్ నాయకత్వం ముప్ప గంగారెడ్డి వైపే మొగ్గు చూపింది. పాలకవర్గ సభ్యులుగా ఐల రాజలింగం, ఎన్నం బాగారెడ్డి, ధన్ల రాజన్న, మేగావత్ మంగ్యా, గ్యానాజి గంగారెడ్డి, వంగా దేవకరుణ, పెంట ఇంద్రుడు, సాయి నేని వెంకటేశ్వరరావు, కొడవు రఘువీర్, మహ్మద్ ఇస్సా, జోగిని మల్లేష్, అలిగాటి నరేందర్ నియమితులయ్యారు. అదేవిధంగా బర్ధిపూర్ సహకార సంఘం చైర్మన్, నిజామాబాద్ మేయర్, వ్యవసాయ శాఖ ఏడీఏ, జిల్లా మార్కెటింగ్ అధికారి సభ్యులుగా ఉండనున్నారు.

కొనసాగిన ఉత్కంఠ..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన పది నెలల తరువాత మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రకటించడం గమనార్హం. చైర్మన్ పదవి కోసం పలువురు కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ వాయిదా పడుతూ వచ్చింది. చైర్మన్‌గా ముప్ప గంగారెడ్డి పేరును మూడు నెలల కిందటే నిర్ణయించినప్పటికీ వివిధ కారణాలతో అనేక విడతలుగా వాయిదా వేస్తూ వచ్చారు. రేపు, ఎల్లుండి అనుకుంటూ మూడు నెలల పాటు ఉత్కంఠగా నడిచింది. చివరకు ఇప్పటికి ప్రకటన రావడం విశేషం.

రైతు కుటుంబ నేపథ్యం..

మోపాల్ మండలంలోని ముదక్‌పల్లి గ్రామానికి చెందిన ముప్ప గంగారెడ్డి రైతు కుటుంబానికి చెందిన వారు. ఇప్పటికీ వ్యవసాయం చేస్తున్నారు. 1987లో బాడ్సి సొసైటీ డైరెక్టర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1988లో ముదక్‌పల్లి సర్పంచ్‌గా, 1995లో ఎంపీటీసీగా, వైస్ ఎంపీపీగా, 2000–05 మధ్య ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, 2005 నుంచి 2014 వరకు బాడ్సి సొసైటీ చైర్మన్‌గా, డీసీసీబీ డైరెక్టర్‌గా ఉన్నారు. 2015 నుంచి జిల్లా కాంగ్రెస్ కిసాన్ ఖేత్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

నామినేటెడ్ వేడి..

జిల్లా నుంచి ఇప్పటికే ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, సుంకేట అన్వేష్‌రెడ్డి, కాసుల బాలరాజు, తాహెర్‌బిన్ హందాన్ లకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లుగా పదవులు లభించాయి. ఇక బాడ్సి శేఖర్‌గౌడ్, గడుగు గంగాధర్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవుల రేసులో ఉన్నారు. కేశ వేణుకు నుడా చైర్మన్ పదవి ఇచ్చేందుకు ఇప్పటికే పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తంమీద నామినేటెడ్ పదవుల వేడి జిల్లాలో మళ్లీ మొదలైంది. బాడ్సి శేఖర్‌గౌడ్‌కు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇప్పించే విషయంలో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి గట్టిగా కృషి చేస్తున్నారు. గడుగు గంగాధర్‌కు కార్పొరేషన్ పదవి ఇప్పించేందుకు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు.

వేల్పూర్, కమ్మర్‌పల్లి ఏఎంసీలు..

వేల్పూర్/కమ్మర్‌పల్లి: మార్కెట్ కమిటీ పాలకవర్గాలను నియమిస్తున్న ప్రభుత్వం వేల్పూర్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీలను ప్రకటించింది. వేల్పూర్ ఏఎంసీ చైర్మన్‌గా మెండోరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్ చైర్మన్‌గా వేల్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే, సభ్యులుగా మలావత్ మహిపాల్, పబ్బ రాజేశ్, జైడి రవికుమార్, ఏనుగు సాయారెడ్డి, ఎంబరి చిన్ననర్సయ్య, క్యాతం కిషన్‌గౌడ్, ఇమ్రాన్‌ఖాన్, గొరాయి నరేందర్, ఆకుల సౌజన్య, వెల్మల గంగాధర్, జొన్నల భూపాల్, జవ్వాజి భూమయ్య, వేంపల్లి సొసైటీ చైర్మన్, ఇతర అధికారులను సభ్యులుగా నియమించింది.

ఆరు సంవత్సరాల తరువాత..

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 2017 జూలై నుంచి 2019 జనవరి వరకు ఏడాదిన్నర కాలం పాటు దివ్య దినేశ్ చైర్ పర్సన్‌గా వ్యవహరించారు. దివ్య దినేశ్‌కు ముందు మార్కెట్‌లో మూడేళ్లు పర్సన్ ఇన్‌చార్జి పాలన నడిచింది. 2019 జనవరితో పాలకవర్గం గడువు ముగిసిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ పర్సన్ ఇన్‌చార్జిని నియమించింది. మళ్లీ ఇప్పుడు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రకటించింది.


కొత్తింటి ముత్యంరెడ్డి
వేల్పూర్ ఏఎంసీ చైర్మన్


పాలెపు నర్సయ్య
కమ్మర్‌పల్లి ఏఎంసీ చైర్మన్

కమ్మర్‌పల్లి..

కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలం నాగాపూర్ మాజీ సర్పంచ్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్‌గా కమ్మర్‌పల్లి మాజీ ఉప సర్పంచ్ సుంకెట బుచ్చన్న నియమితులయ్యారు. అలాగే, సభ్యులుగా జైడీ మధులత, రిక్క ముత్తెన్న, నర్సాపురం జీవన్, కిస్తి చిన్న బాబన్న, బానవత్ రాములు, రొక్కం సంపత్, లక్క రంజిత్, కోరిపెల్లి లింగారెడ్డి, భూత్‌పురం మహిపాల్, అబ్దుల్ నవీద్, జవ్వాజీ శ్రీనివాస్, జొన్నల నడ్పి భూమయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరితో పాటు భీమ్‌గల్ మండలం ముచ్కూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, భీమ్‌గల్ ఏడీఏ, కమ్మర్‌పల్లి గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి సభ్యులుగా ఉంటారు.

రూ.25 కోట్ల ఆదాయం..

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధి నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్ నియోజకవర్గాలోని 10 మండలాల్లో విస్తరించి ఉంది. అందువల్ల దీని పాలకవర్గం ఎంపిక విషయంలో పార్టీ నాయకత్వంతో పాటు నాలుగు నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు సమన్వయం చేసుకుని చైర్మన్‌ను, సభ్యులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత పాలకవర్గం రెండేళ్లపాటు కొనసాగనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్లకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. నిజామాబాద్ మార్కెట్ కమిటీని ఓసీ జనరల్‌కు కేటాయించారు. ఈ మార్కెట్ యార్డులో పసుపు, ఆమ్‌చూర్, ఉల్లిగడ్డ, మొక్కజొన్న, సోయా, వరి, పెసర్లు, కందులు, కూరగాయలు, ఇతర అన్నిరకాల పంటల క్రయవిక్రయాలు జరుగుతాయి. మార్కెట్ కమిటీకి ఏడాదికి సుమారు రూ.25 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది.

డిప్యుటేషన్ పేరుతో డుమ్మా

- అంతర్‌పాఠశాలల క్రీడల పేరుతో విధులకు ఎగనామం
- స్కూళ్లకు వెళ్లడం ఇష్టం లేక టీచర్ల నిర్వాకం

నిజామాబాద్ అర్బన్: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన టీచర్లు డిప్యుటేషన్ పేరుతో విధులకు డుమ్మా కొట్టారు. నవీపేట మండలం బినోల ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు అంతర్ పాఠశాలల మండల స్థాయి క్రీడలను నిర్వహించారు. క్రీడాపోటీలు నిర్వహించిన పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా ఉన్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి డీఈవోను కలిసి క్రీడాపోటీల నిర్వహణ కోసం 64 మందిని డిప్యుటేషన్ వేయించినట్లు తెలిసింది. ఇందులో సిరికొండ, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, కోట గిరి, నందిపేట మండలల్లోని పాఠశాలలకు చెందిన 46 మంది పీఈటీలతోపాటు 18 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలున్నారు. అయితే, వీరిలో నుంచి కేవలం 22 మంది మాత్రమే మూడు రోజులపాటు కొనసాగిన మండల స్థాయి క్రీడాపోటీలకు హాజరుకాగా, మిగతా వారు అటువైపు కన్నెత్తి చూడలేదని తెలిసింది. విద్యాబోధనను పక్కన పెట్టి టీచర్లను ఆటల పోటీలకు తీసుకెళ్లడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డిప్యుటేషన్ పేరుతో పాఠశాల విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులు అటు క్రీడా పోటీలకు వెళ్లకుండా, ఇటు రోజువారీ విధులకు హాజరుకాకుండా తప్పించుకుని తిరిగారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండల స్థాయి క్రీడాపోటీల నిర్వహణకు ఏకంగా 64 మందిని పంపించడంపై అధికారులు విచారణ చేపట్టాలని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

విచారణ చేపట్టాలి

మండల స్థాయి ఆటల పోటీలకు ఏకంగా 64 మంది టీచర్లను డిప్యుటేషన్ వేయడంపై విచారణ చేపట్టాలి. ఇంత పెద్ద సంఖ్యలో టీచర్లను ఆటల పోటీలకు పంపించడం నిబంధనలకు విరుద్ధం. డిప్యుటేషన్‌పై వెళ్లిన వారందరూ క్రీడాపోటీల్లో పాల్గొన్నారా? వీరికి ఉత్తర్వులు ఇచ్చింది ఎవరు? అనేది తేల్చాలి. టీచర్లు స్కూళ్లకు వెళ్లకుండా తప్పించుకోవడం తగదు.
– సత్యానంద్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

మహిళా శక్తి.. ఆర్థిక దీప్తి

- అండగా నిలుస్తున్న స్వయం సహాయక సంఘాలు
- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్న అతివలు

సండే స్పెషల్



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : స్వయం సహాయక సంఘాలు మహిళల జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయి. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బాటలు వేశాయి. జిల్లాలో 17,098 స్వయం సహాయక సంఘాల్లో 1.75 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా అందిస్తున్న రుణాలను చాలా మంది మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇటీవల ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మహిళా శక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2024–25లో జిల్లాలో 22,007 మంది మహిళలకు రూ.186.42 కోట్ల వడ్డీలేని రుణాలను అందించి సూక్ష్మ తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టింది.

ఫినాయిల్ తయారీతో ఉపాధి

దోమకొండ మండల కేంద్రానికి చెందిన బుర్రి మహేశ్వరి భర్త స్వామి పదేళ్ల క్రితం చనిపోయారు. దీంతో పిల్లల పోషణ భారం ఆమెపై పడింది. బీడీలు చుట్టగా వచ్చే ఆదాయం ఇద్దరు పిల్లల చదువులకు ఏమాత్రం సరి పోదని భావించిన మహేశ్వరి.. అప్పట్లో దోమకొండ సంస్థానాధీశుడు దివంగత ఉమాపతిరావును కలిసింది. ఆయన ఫినాయిల్ తయారీలో శిక్షణ ఇప్పించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణం పొందిన మహేశ్వరి.. సొంతంగా ఫినాయిల్ తయారు చేయడం ఆరంభించింది. అప్పట్లో రూ.80 వేలు దాకా పెట్టుబడి పెట్టింది. అలాగే చాయ్‌పత్తి ముడిసరుకు కొను గోలు చేసి, చాయ్‌పత్తి తయారు చేసి ప్యాకెట్లుగా చేసి అమ్ముతోంది.



పుట్టగొడుగుల పెంపకం



తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామానికి చెందిన విద్యావంతురాలైన చుక్క రాధిక ఇంట్లోనే పుట్టగొడుగుల పెంపకం మొదలుపెట్టింది. భర్త రవీందర్‌గౌడ్ సహకారంతో పుట్టగొడుగులను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. పుట్టగొడుగుల పెంపకానికి అవసరమైన యంత్రాలు, సామగ్రికి రూ.2 లక్షలకుపైగా ఖర్చవుతుంది. అయితే రాధిక మాత్రం యంత్రాల సాయం లేకుండానే చిన్న పాటి కటింగ్ ప్లేయర్‌తో పనులు చేసుకుంటోంది. యూట్యూబ్‌లో సెర్చ్ చేసి పుట్టగొడుగుల పెంపకం గురించి తెలుసుకున్నానని, అనంతరం హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుని రూ. 20 వేల పెట్టుబడితో ఇంట్లోనే పుట్టగొడుగుల పెంపకాన్ని ప్రారంభించానని రాధిక చెబుతోంది.

స్థానిక ఎన్నికల్లో భారీ విజయమే లక్ష్యం


ఉమ్మడి జిల్లా సమీక్షలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ విజయమే లక్ష్యంగా బూత్ స్థాయిలో పార్టీని పకడ్బందీగా ముందుకు తీసుకెళ్లాలని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్ గాంధీ భవన్ లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ వ్యవహారాల నిర్వహణపై వివరించారు. నియోజకవర్గాల్లో సమస్యలను ముఖ్యమంత్రికి, పార్టీ అంశాలను పీసీసీకి ఎప్పటికప్పుడు నివేదించాలన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పార్లమెంట్ ఇన్‌చార్జి విశ్వనాథన్, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, పోచారం శ్రీనివాస రెడ్డి, మదన్ మోహన్, లక్ష్మీకాంతా రావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రెండు జిల్లాల డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, కైలాష్ శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జులు సునీల్ రెడ్డి, వినయ్ రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు ఈరవత్రి అనిల్, అన్వేష్ రెడ్డి, బాలరాజు, తాహెర్, నాయకులు మండవ వెంకటేశ్వర రావు, శేఖర్ గౌడ్, గడుగు గంగాధర్, కేశ వేణు, వేణుగోపాల్ యాదవ్, ఆకుల లలిత తదితరులు పాల్గొన్నారు. కాగా అక్టోబర్ 4న మహేశ్ గౌడ్ జిల్లాకు రానున్నట్లు సమాచారం.



క్లుప్తంగా

పైలట్‌ ప్రాజెక్ట్‌కు కరాటే మాస్టర్‌ అశోక్‌ ఎంపిక


అశోక్‌ కుమార్‌ రోడే

బోధన్‌: రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసిన వివిధ జీవన నైపుణ్యాభివృద్ధి శిక్షణ పైలట్‌ ప్రాజెక్ట్‌కు ఉమ్మడి జిల్లా నుంచి తాను ఎంపికైనట్లు బోధన్‌కు చెందిన సీనియర్‌ కరాటే మాస్టర్‌ అశోక్‌ కుమార్‌ రోడే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యార్హతలు, కరాటే శిక్షణలో అపార అనుభవాన్ని పరిగణలోకి తీసుకొని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ పాఠశాల బాలికలకు కరాటే శిక్షణతో పాటు జీవన నైపుణ్యాలకు సంబంధించిన అంశాలను అవగాహన కల్పించాల్సి ఉంటుందని వివరించారు. తన ఎంపికకు సహకరించిన పైలట్‌ ప్రాజెక్టు చైర్మన్‌ రాణి రుద్రమదేవి, సభ్యుడు రవి మాస్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం



ఖలీల్‌వాడి: పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌హందాన్‌ శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సన్మానించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి నేతకు, కార్యకర్తకు గుర్తింపు లభిస్తోందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు గడ్కోల్‌ గంగారెడ్డి ఉన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లో మత్తు పదార్థాల సరఫరాపై ఒకటో టౌన్‌ పోలీసులు, రైల్వే పోలీసులు శనివారం డాగ్‌ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం తోపాటు పార్సిల్‌ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వన్‌ టౌన్‌ ఏఎస్సై లాయకల్లి, డాగ్‌ స్క్వాడ్‌ ఇన్‌చార్జి మోహన్‌, రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

సైన్స్‌ బిల్డింగ్‌ పనులు..



తెయూ(డిచ్‌పల్లి): తెయూ క్యాంపస్‌లో నిర్మిస్తున్న సైన్స్‌ బిల్డింగ్‌ పనులను రిజిస్ట్రార్‌ యాదగిరి శనివారం తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలను అనుసరించి నిర్మాణ పనులు పూర్తి చేసి బిల్డింగ్‌ను యూనివర్సిటీకి అందించాలని ఇంజినీర్‌ సాయన్నకు రిజిస్ట్రార్‌ సూచించారు. రిజిస్ట్రార్‌ వెంట యూనివర్సిటీ ఇంజినీర్‌ వినోద్‌, కాంట్రాక్టర్‌ మైదం రాజన్న, సిబ్బంది ఉన్నారు.

లేత మనసుపై చెరగని గాయం

- పెరుగుతున్న పోక్సో కేసుల సంఖ్య
- తల్లిదండ్రులూ జాగ్రత్త!

- నగరంలోని రెండో టౌన్‌ పీఎస్‌ పరిధిలో కిరాణషాపునకు వెళ్లిన చిన్నారిని చాక్లెట్‌ ఇస్తానని చెప్పి ఓ వ్యక్తి లైంగికంగా వేధించాడు. దీంతో బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు అతనిపై పోక్సో కేసు నమోదు చేసి జైలుకు తరలించారు.
- నగరంలోని ఐదో టౌన్‌ పీఎస్‌ పరిధిలోని ఓ కాలనీలో బాలికపై లైంగిక దాడి జరగడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖలీల్‌వాడి: ఎనిమిదేళ్ల పైబడిన చిన్నారులు, కౌమార దశ అమ్మాయిలను లక్ష్యంగా చేసుకొని కొందరు ప్రబుద్ధులు వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో తరచూ చోటు చేసుకుంటున్నాయి. వారం, పదిహేను రోజులకు ఒక పోక్సో కేసు నమోదు కావడం గమనార్హం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 80 పోక్సో కేసులు నమోదయ్యాయి. ఈ అత్యాచార ఘటనల్లో నిందితులు ఎక్కువ శాతం బంధువులు, చుట్టుపక్కల వారు, పరిచయస్తులే ఉంటున్నారు. చాలా మంది యువకులు, బాలురు సినిమాలు, స్మార్ట్‌ఫోన్లలో అశ్లీల చిత్రాలకు చెడు దారి పడుతున్నారు. తల్లిదండ్రులు, విద్యాలయాల్లో టీచర్లు బాలికలకు మంచి, చెడులపై అవగాహన కల్పించాలని నిపుణులు చెబుతున్నారు. దీంతో పాటు పోలీసులు, విద్యాశాఖ, ఐసీడీఎస్‌ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కేసుల విచారణ, కోర్టు తీర్పుల్లో వేగం..

మహిళా వ్యతిరేక నేరాల్లో పోక్సో కేసుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆందోళనకరం. లైంగిక దాడులు, అత్యాచారాలు లేత మనసులను గాయపరుస్తున్నాయి. వారి చదువులు, భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్నాయి. కౌమార దశ బాలికలది ఎదిగే వయసు. ఏది మంచో? ఏది చెడో పసిగట్టలేరు. ఎవరైనా దురుద్దేశంతో చేతులు పట్టుకున్నా.. శరీర భాగాలు తడిమినా తిరస్కరించలేరని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. దీన్నే కొందరు ప్రబుద్ధులు అలుసుగా తీసుకొని వికృతాలకు పాల్పడుతున్నారు. పోక్సో కేసుల్లో నేరం రుజువైతే 20 ఏళ్ల వరకు కఠిన శిక్ష విధించే అవకాశం ఉన్నా కొందరు మద్యం మత్తులో అకృత్యాలకు తెగబడుతున్నారు.

పోక్సో కేసుల వివరాలు

2022	2023	2024
80	77	80

(జనవరి 1 నుంచి సెప్టెంబర్‌ 11 వరకు)

తల్లిదండ్రుల చేతుల్లోనే భద్రత..

తినే వస్తువులపై ఆశచూపి కొందరు పిల్లల్ని బయటకు తీసుకెళ్లడం, లైంగికదాడులకు పాల్పడటం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇతరులిచ్చే చాక్లెట్లు, తీపి పదార్థాలు, బహుమతులను సున్నితంగా తిరస్కరించేలా బాలికలకు తల్లిదండ్రులు చెప్పాలి. శరీర భద్రత గురించి అవగాహన కల్పించాలి. పాఠశాలల్లో ఎవరైనా అనుచితంగా ప్రవరిస్తున్నారా? అని అడగాలి. ఎంత తెలిసిన వారైనా కౌమారదశ అమ్మాయిలను మగవారికి సన్ని హితంగా మెలగనివ్వొద్దు. ఒంటరిగా వేరొకరితో సినిమాలు.. షాపింగ్‌, పర్యాటక ప్రదేశాలకు పంపొద్దు. ఎంత దగ్గరి వరసైనా.. బంధువులైనా అనుమానం వచ్చేలా, అతి చనువుగా ప్రవర్తిస్తుంటే తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలి. తమతో ఎవరైనా ఇబ్బందికరంగా ప్రవర్తించినప్పుడు గట్టిగా అరిచి చుట్టుపక్కలవారి సాయం పొందాలని వివరించాలి. ఆత్మరక్షణ కోసం ప్రత్యేకంగా కరాటే నేర్పించాలి.

బాలికలపై దృష్టి సారించాలి

బాలికలపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి సారించాలి. స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి. పిల్లలతో ఎవరు సన్నిహితంగా ఉంటున్నారో గమనిస్తూ ఉండాలి. ఒంటరిగా పిల్లలను బయటకు పంపొద్దు, ఇంటి నుంచి విడిచి వెళ్లొద్దు. కుటుంబ సభ్యులు అందుబాటులో ఉండేలా చూడాలి.

– నరహరి, పట్టణ సీఐ, నిజామాబాద్‌

ముగిసిన అటవీ శాఖ క్రీడలు


ట్రోఫీ అందుకుంటున్న నిజామాబాద్‌ జిల్లా ఉద్యోగులు


మార్చ్‌ పాస్ట్‌లో బహుమతి సాధించిన జగిత్యాల జట్టు

- ప్రతిభ కనబర్చిన నిజామాబాద్‌ ఉద్యోగులు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): నిజామాబాద్‌ జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జోనల్‌ స్థాయి అటవీ శాఖ ఉద్యోగుల క్రీడలు శనివారం ముగిశాయి. పోటీల్లో ఉద్యోగులు ఉల్లాసంగా పాల్గొన్నారు. క్రికెట్‌లో నిజామాబాద్‌ విజేతగా నిలవగా, నిర్మల్‌ రన్నర్‌గా నిలిచింది. అలాగే టగ్‌ ఆఫ్‌ వార్‌ గేమ్‌లో నిజామాబాద్‌ విజేతగా, ఆదిలాబాద్‌ రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్‌లో ఆదిలాబాద్‌ విన్నర్‌గా, నిజామాబాద్‌ రన్నర్‌ స్థానాలు సాధించాయి. కబడ్డీలో నిర్మల్‌ విన్నర్‌, నిజామాబాద్‌ రన్నర్‌గా అదే విధంగా మార్చ్‌ ఫస్ట్‌లో నిజామాబాద్‌ విన్నర్‌, రన్నర్‌గా జగిత్యాల జిల్లా నిలిచింది. విజేతలకు సీసీఎఫ్‌ శర్వానంద్‌ బహుమతులు అందజేసి అభినందించారు. జోనల్‌ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు వచ్చే నెల హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఇందులో డీఎఫ్‌డీవోలు నిఖిత, రవి ప్రసాద్‌, రవీందర్‌, తదితరులు పాల్గొన్నారు.

సీఎం క్యాంప్‌ ఆఫీస్‌లో కొండా లక్ష్మణ్‌ వర్ధంతి



ఖలీల్‌వాడి: హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్‌ ఆఫీస్‌లో కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి కొండా లక్ష్మణ్‌ బాపూజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

అక్టోబర్‌ 3 నుంచి ‘ఓపెన్‌’ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: ఓపెన్‌ పబ్లిక్‌ స్కూల్‌ పరీక్ష నిర్వహణ షెడ్యూల్‌ విడుదలైందని, అక్టోబర్‌ 3 నుంచి ఓపెన్‌ స్కూల్‌, ఇంటర్‌ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్‌ శనివారం పేర్కొన్నారు. ఇంటర్‌ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు, పదో తరగతి పరీక్షలు ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ఉంటాయన్నారు. ప్రాక్టికల్‌ పరీక్షలు అక్టోబర్‌ 16 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యాసంస్థల్లో పాముల కలకలం


పాఠశాలలోకి వస్తున్న పాము

నిజాంసాగర్‌: మహమ్మద్‌నగర్‌ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పాము కలకలం రేపింది. ప్రార్థన సమయానికి ముందుగా అటెండర్‌ మాజీద్‌ తరగతి గదుల తాళాలు తెరవ డంతో విద్యార్థులు తరగతుల్లో బ్యాగులు పెట్టేందుకు వెళ్లారు. ఓ తరగతి గది తలుపులు తెరవగానే పెద్ద పామును అటెండర్‌కు కనిపించింది. అప్రమత్తమైన అటెండర్‌ మాజీద్‌, పీఈటీ భూమయ్య విదార్థులను దూరంగా పంపించి కర్రతో పామును చంపారు. పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని జీపీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు.

తెయూ కంప్యూటర్‌ సైన్స్‌ కాలేజ్‌లో ..


ల్యాబ్‌లోకి వచ్చిన పాము

తెయూ(డిచ్‌పల్లి): తెయూ కంప్యూటర్‌ సైన్స్‌ కాలేజ్‌ భవనంలోకి శనివారం రెండు పాములు రావడంతో సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. ఒక పాము కళాశాల ఆవరణలో తిరుగుతుండగా మరో పాము కంప్యూటర్‌ ల్యాబ్‌లోకి ప్రవేశించింది. అప్రమత్తమైన సిబ్బంది పాములను చాకచక్యంగా కాలేజ్‌ బయటకు పంపించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కొనసాగుతున్న విచారణ

సదాశివనగర్‌: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో దొంగలు బ్యాటరీలు, కంప్యూటర్‌లు ఎత్తుకెళ్లిన ఘటనలో పోలీసులు విచారణ చేపట్టారు. కార్యాలయంలో పని చేసే సిబ్బందిని విచారించారు. పీఎస్‌కు సమీపంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో దొంగలు పడడం పోలీసులకు సవాలుగా మారింది. కార్యాలయంలోకి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి చొరబడినట్లు కనిపించకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. సిబ్బంది వివరాలను ఆరా తీసినట్లు ఎస్సై రంజిత్‌ తెలిపారు.

ధాన్యం సేకరణ సజావుగా సాగేలా కృషి చేయాలి

- అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌

సుభాష్‌నగర్‌: వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులు అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌ సూచించారు. ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. వానాకాలం ధాన్యం సేకరణకు సంబంధించి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్‌ సంబంధిత శాఖల అధికారులతో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. అక్టోబర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తేనున్న నేపథ్యంలో, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో సుమారు 4.10 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారని, సన్న రకాలు 85 శాతం ఉందన్నారు. వరి ధాన్యం ‘ఏ’ గ్రేడ్‌ రకానికి క్వింటాలుకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 ధర చెల్లిస్తామని పేర్కొన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో సాయాగౌడ్‌, డీఎస్‌వో అరవింద్‌ రెడ్డి, సివిల్‌ సప్లయీస్‌ డీఎం రమేశ్‌, డీసీవో శ్రీనివాస్‌రావు, జిల్లా మార్కెటింగ్‌ శాఖ అధికారిణి గంగూబాయి, డీపీఎం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో జడ్జీలను నియమించాలి


హైకోర్టు జడ్జికి వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

ఖలీల్‌వాడి: జిల్లా కోర్టు ప్రాంగణంలోని వివిధ కోర్టులలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌ మోహన్‌గౌడ్‌, ప్రతినిధి బృందం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కాసోజు సురేందర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. జిల్లా జ్యుడిషియల్‌ సమావేశంలో పాల్గొనేందుకు ప్రభుత్వ అతిథి గృహానికి వచ్చిన హైకోర్టు జడ్జికి న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది, కక్షిదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నారు. నూతనంగా మంజూరైన నిజామాబాద్‌ అదనపు సీనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టు, నిజామాబాద్‌ ఐదో జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టులలో న్యాయమూర్తులను నియమించాలని కోరారు. ఓల్డ్‌ విద్యాశాఖ కార్యాలయ ఆవరణ స్థలాన్ని జిల్లా జ్యుడిషియల్‌కు కేటాయించేలా కృషి చేయాలని కోరారు. బార్‌ ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్‌ రావు, కోశాధికారి దీపక్‌, సీనియర్‌ న్యాయవాదులు మంచికట్ల గోవర్ధన్‌, రాజలింగం, జీవీ కృపాకర్‌ రెడ్డి, కవిత రెడ్డి, పిల్లి శ్రీకాంత్‌ అయూబ్‌, మాణిక్‌ రాజు, ఆశ నారాయణ, రవి, ఛీఫ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ రాజుకుమార్‌ సుబేదార్‌ తదితరులు పాల్గొన్నారు.

సెషన్స్‌ కోర్టు ఇన్‌చార్జి పీపీగా రాజారెడ్డి



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ జిల్లా కోర్టు ఇన్‌చార్జి పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా సీనియర్‌ న్యాయవాది, పోక్సో కోర్టు స్పెషల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ మాదస్తు రాజారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్‌ చీఫ్‌ సెక్రెటరీ రవిగుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పోక్సో కోర్టు స్పెషల్‌ పీపీగా ఉన్న ఆయన జిల్లా సెషన్స్‌ కోర్టులో పోలీసుల తరపున క్రిమినల్‌ కేసులను ప్రాసిక్యూషన్‌ నిర్వహిస్తారు. రాజారెడ్డి గతంలో జిల్లా సెషన్స్‌ కోర్టు పబ్లిక్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా మూడేళ్లపాటు విధులు నిర్వర్తించారు. మాదస్తుకు తెలంగాణ రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ సభ్యులు మంథని రాజేందర్‌రెడ్డి, చీఫ్‌ లీగల్‌ ఎయిడ్‌ కౌన్సిల్‌ రాజ్‌కుమార్‌ సుబేదార్‌, బార్‌ అధ్యక్షుడు జగన్‌మోహన్‌, న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

28 నుంచి రాష్ట్రస్థాయి యోగా పోటీలు



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి యోగాసన పోటీలను ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు యోగాసన స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర సీనియర్‌ ఉపాధ్యక్షుడు రాంచందర్‌ తెలిపారు. పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ శనివారం ఆవిష్కరించారు. సీనియర్‌ ఏ.బీ.సీ 5వ రాష్ట్రస్థాయి యోగాసన పోటీలను నగరంలోని శివాజీనగర్‌ మున్నూరుకాపు కళ్యాణ మండపంలో నిర్వహిస్తామన్నారు. రాష్ట్రసీనియర్‌ కాంపిటీషన్‌ డైరెక్టర్‌ రాంరెడ్డి జిల్లా యోగాసనా స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ కార్యదర్శి టి బాలశేఖర్‌, ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ జి సంగీత, హెచ్‌ శ్రీనివాస్‌, కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్‌పై అధికారుల దాడులు


ఎడపల్లిలోని ఏఆర్‌ ఆగ్రో ఇండస్ట్రీస్‌ రైస్‌మిల్‌

ఎడపల్లి: మండల శివారులోని ఏఆర్‌ ఆగ్రో ఇండస్ట్రీస్‌ రైస్‌మిల్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు శుక్రవారం రాత్రి దాడులు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ టాస్క్‌ఫోర్స్‌ ఓఎస్డీ శ్రీధర్‌ శనివారం మాట్లాడుతూ.. ఈ రైస్‌ మిల్లులో జూలై17న డీఎస్‌వో నందిని డీటీలతో కలిసి తనిఖీలు నిర్వహించినపుడు ధాన్యం కొరత వచ్చిందన్నారు. రైస్‌ మిల్లుకు లక్షా11వేల259 క్వింటాళ్ల జిల్లా పౌరసరఫరా అధికారులు అలాట్మెంట్‌ చేసినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన 83,413 క్వింటాళ్ల ధాన్యాన్ని ప్రభుత్వానికి అందించలేదని, రైస్‌ మిల్‌లో దీనికి సంబంధించిన స్టాక్‌ లేదని గుర్తించినట్లు పేర్కొన్నారు. దీంతో రైస్‌మిల్‌ లీజ్‌ ఓనర్‌ రంజిత్‌ 83,413 క్వింటాళ్ల రైస్‌కు సుమారూ.18.46 కోట్లు మూడు వాయిదాల్లో ప్రభుత్వానికి చెల్లిస్తానని చెప్పడంతో అధికారులు ఏఆర్‌ ఆగ్రో ఇండస్ట్రీస్‌ రైస్‌మిల్‌కు అవకాశం ఇచ్చారని తెలిపారు. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వానికి డబ్బులు చెల్లించ లేదన్నారు. విచారణ అనంతరం ఇండస్ట్రీస్‌ యజమాని రంజిత్‌తో పాటు మరో వ్యక్తి కిషన్‌పై క్రిమినల్‌ కేసుకు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. తనిఖీల్లో డీటీలు వినోద్‌, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

మద్యం మత్తులో కిందపడి సొసైటీ డైరెక్టర్‌ మృతి


లింబాద్రి మృతదేహం

బాల్కొండ: మద్యం మత్తులో సొసైటీ డైరెక్టర్‌ కిందపడి మృతిచెందిన ఘటన బాల్కొండ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్‌ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. నాగాపూర్‌ గ్రామానికి చెందిన బాల్కొండ సహకార సంఘం డైరెక్టర్‌ గురికాడి లింబాద్రి(50) శుక్రవారం రాత్రి మండల శివారులోని ఓ ఫాం హౌస్‌లో సహ డైరెక్టర్లతో కలిసి విందు చేసుకున్నారు. మద్యం మత్తులో ఉన్న లింబాద్రి ఇంటికి వెళ్తానని బైక్‌ వద్దకు వచ్చి కిందపడ్డాడు. ఈ ఘటనలో బైక్‌ అతనిపై పడడంతో తల, కన్నుపై తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌ తండా వద్ద ఉన్న జాతీయ రహదారిపై శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని భీమ్‌గల్‌ మండలం సుదర్శన్‌నగర్‌ తండాకు చెందిన భూక్య సీతారాం(60) మృతి చెందాడు. జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. భూక్య సీతారాం మదన్‌పల్లి తండాలో ఉన్న తన కుమార్తె వద్దకు మోటార్‌సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా పడకల్‌ తండా వద్ద జాతీయ రహదారిపై యూటర్న్‌ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడు సురేష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గాంధారిలో చోరీ


ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

గాంధారి: మండల కేంద్రంలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. గాంధారి మండల కేంద్రానికి చెందిన కుమ్మరి రంజిత్‌ తన కుటుంబీకులతో కలిసి గురువారం వేములవాడకు వెళ్లారు. దుండగులు ఇంటికి తాళం ఉండడంతో చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చిన రంజిత్‌ ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సంతోష్‌, ఎస్సై ఆంజనేయులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బీరువాలో ఉన్న ఏడు తులాల బంగారం, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

నవీపేట: మండలంలోని అబ్బాపూర్‌(ఎం) సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మాక్లూర్‌ మండలంలోని బొంకన్‌పల్లి గ్రామానికి చెందిన ట్రాన్స్‌కో ఉద్యోగి గడీల సతీశ్‌ కుమార్‌కు గాయాలైనట్లు ఎస్సై వినయ్‌ శనివారం తెలిపారు. నిజామాబాద్‌ నుంచి నవీపేట వైపు బైక్‌పై సతీశ్‌కుమార్‌ వస్తుండగా ముందు వెళ్తున్న ఆటో ఒక్కసారిగా రోడ్డుపై ఆపడంతో వెనుక ఉన్న సతీశ్‌ కుమార్‌కు ఆటో తగిలి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి తమ్ముడు నితీశ్‌కుమార్‌ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్‌: పోతంగల్‌ మండలం సోంపూర్‌లో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు, రెవెన్యూ అధికారులు శనివారం పట్టుకున్నారు. ట్రాక్టర్లను కోటగిరి పీఎస్‌కు తరలించారు. మంజీర నది నుంచి రాత్రి వేళ అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు నిఘా ఉంచగా మూడు ట్రాక్టర్లు పట్టుబడినట్లు తహసీల్దార్‌ మల్లయ్య పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలు, వాటి యాజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. సీజ్‌ చేసిన వాహనాలను ట్రాన్స్‌పోర్టు, మైనింగ్‌ అధికారులకు అప్పగిస్తామని, బాధ్యులను బైండోవర్‌ చేస్తామని పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రుద్రూర్‌: కోటగిరి మండలం లింగాపూర్‌ శివారులో పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేయగా తొమ్మిది మంది పట్టుబడ్డారు. వీరి నుంచి రూ. 46,060 నగదు, తొమ్మిది సెల్‌ఫోన్లు, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు.

అప్పుల బాధతో వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య


అల్లె వినోద్‌ (ఫైల్‌)

నవీపేట: మండలంలోని అభంగపట్నం గ్రామానికి చెందిన అల్లె వినోద్‌ కుమార్‌(30) అప్పుల బాధతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయారెడ్డి శనివారం తెలిపారు. దుబాయికు వెళ్లేందుకు అప్పుచేసి వీసా పొందిన వినోద్‌ మెడికల్‌ టెస్టులకు వెళ్లాడని పేర్కొన్నారు. ఫిట్‌నెస్‌లో ఫెయిల్‌ అవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడని, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తితో శనివారం వేకువజామున గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై పేర్కొన్నారు.

కుమార్తె వివాహం కోసం..


సాయిబాబు(ఫైల్‌)

బాల్కొండ: కుమార్తె వివాహం కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బాల్కొండ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్‌ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. బాల్కొండ మండల కేంద్రంలోని పోచమ్మగల్లీకి చెందిన జెట్టి సాయిబాబు(48) తన కుమార్తె వివాహం కోసం అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో తెలియక మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవపడుతుండేవాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంట్లో ఉన్న వారిని బయటకు పంపించాడు. కొద్దిసేపటికి అనుమానం వచ్చిన కుటుంబీకులకు తలుపులు బద్దలు కొట్టి చూడగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సాయికిరణ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై యువకుడు..


రాధాకృష్ణ (ఫైల్‌)

డిచ్‌పల్లి: మండలంలోని గొల్లపల్లికి చెందిన తేలు రాధాకృష్ణ (32) మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్‌ తెలిపారు. ఎస్సైతెలిపిన వివరాల ప్రకారం.. రాధాకృష్ణ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం తెల్లవారు జామున భార్యా, పిల్లలు పడుకున్న గదికి బయట గొల్లెం పెట్టి మరో గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిందితుల రిమాండ్‌

రామారెడ్డి: చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేశ్‌ శనివారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. రామారెడ్డి మండలం పోసానిపేట్‌ గ్రామంలో వ్యవసాయ పొలాల్లో అదే గ్రామానికి చెందిన పల్లెపు రాజు, సుద్దాల సంతోష్‌ వ్యవసాయ పరికరాలు, పురుగుల మందు చల్లే మిషన్లు, ఇతర పరికరాలను చోరీలకు పాల్పడేవారు. ఈ క్రమంలో చోరీలకు పాల్పడుతున్న వీరిని గ్రామస్తుల సహకారంతో పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

నిజామాబాద్‌ రూరల్‌: మహిళను గాయపర్చిన కేసులో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో ఆరీఫ్‌ శనివారం తెలిపారు. ఖానాపూర్‌కు చెందిన శోభ ఫోన్‌ మూడు నెలల క్రితం పోయింది. ఈ ఫోన్‌ను అదే గ్రామానికి చెందిన సాయికుమార్‌ తీశాడనే అనుమానంతో అతను కనిపించిన ప్రతిసారి దుర్భాషలాడేది. శనివారం సైతం వీరి మధ్య గొడవ జరిగింది. క్షణికావేశంలో అతను శోభ తలపై కర్రతో బాదాడు. ఆమెకు తీవ్రగాయం కావడంతో ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.